సాక్షి నంద్యాల

శుక్రవారం • 6 • సెప్టెంబర్ • 2024



బాధ్యతల స్వీకరణ

కర్నూలు: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కర్నూలు ప్రాంతీయ అధికారిగా కందుల చౌడేశ్వరి గురువారం బాధ్యతలు చేపట్టారు. పలువురు అధికారులు ఆమెకు స్వాగతం పలికారు.



జిల్లాలో మోస్తరు వర్షం

నంద్యాల(అర్బన్): జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. బేతంచెర్లలో అత్యధికంగా 20.2 మి.మీ వర్షం కురిసింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,632
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 32,877
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	: 28,960

న్యూస్‌రీల్

సంక్షేమ హాస్టళ్లలో బయోమెట్రిక్ తప్పనిసరి

నంద్యాల(అర్బన్): బీసీ సంక్షేమ వసతి గృహాల్లో బయోమెట్రిక్ తప్పని సరి చేయాలని జిల్లా బీసీ సంక్షేమం సాధికారత అధికారి ముస్తాక్ అహమ్మద్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో జిల్లా స్థాయి బీసీ సంక్షేమ వసతి గృహ సంక్షేమాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందించాలన్నారు. సమయానుకూలంగా విధులు నిర్వహిస్తూ వార్డెన్లు విద్యార్థులకు అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డోన్ ఏబీసీడబ్ల్యూఓ ఓబులేసు, వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర పాల్గొన్నారు.

రూ.6.98 లక్షల విలువైన విత్తనాల అమ్మకాల నిలుపుదల

నంద్యాల(అర్బన్): సరైన బిల్ బుక్స్, ధ్రువపత్రాలు లేని శ్రీ నరేంద్ర హైబ్రీడ్ సీడ్స్‌కు సంబంధించి రూ.6.98 లక్షల విలువైన విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశామని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని పలు విత్తన ప్రాసెసింగ్ ప్లాంట్లు, విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. శ్రీనరేంద్ర హైబ్రీడ్ సీడ్స్‌లో రిజిస్టర్, బిల్ బుక్స్, సరైన ధ్రువపత్రాలు లేనందున రూ.6,98,275 విలువ గల విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలని, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఎస్సార్‌బీసీకి నీటి విడుదల పెంపు

బనగానపల్లె: గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వకు నీటి విడుదలను పెంచారు. ప్రారంభంలో 1000 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేసిన అధికారులు రైతుల అవసరాల కోసం 2 వేల క్యూసెక్కులకు పెంచారు. ఎస్సార్‌బీసీ ద్వారా 1.62 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించడమేకాకుండా అవుకు రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తున్నారు. అవుకు రిజర్వాయర్ నుంచి ఆయకట్టు పరిధిలోని సుమారు 6 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఇక్కడి నుంచి వైఎస్సార్ జిల్లాలోని గండికోట మైలవరం మరిన్ని ప్రాజెక్టులకు నీరు చేరుతుంది.

రైతు ఆత్మహత్య



రైతు గంగన్న

శిరివెళ్ల: అప్పుల బాధ తాళలేక ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్‌ఐ చిన్న పీరయ్య తెలిపిన వివరాల మేరకు.. శిరివెళ్ల ఎస్సీ కాలనీకి చెందిన రైతు అల్లూరి గంగన్న (54) తనకున్న ఎకరన్నర పొలంతో పాటు మరో మూడున్నర ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. కుమార్తెల వివాహాల ఖర్చు, వ్యవసాయంలో వచ్చిన నష్టాలతో దాదాపు రూ. 8 లక్షలు అప్పు అయ్యింది. అప్పు భారం తట్టుకోలేక ఈ నెల 3వ తేదీ రాత్రి ఇంటిలో పురుగు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబీకులు గుర్తించి చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య విశ్వాసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సికిల్ సెల్ అనీమియాపై అవగాహన అవసరం



మందులను అందజేస్తున్న డాక్టర్ అంజలి

చాగలమర్రి: ప్రాణాంతకమైన సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన అవసరమని చాగలమర్రి పీహెచ్‌సీ ప్రభుత్వ వైద్యాధికారిణి పి.అంజలి అన్నారు. గురువారం ఆసుపత్రిలో ఈ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో ఇప్పటి వరకు 400 మంది అనుమానితులకు రక్త పరీక్షలు నిర్వహించామన్నారు. వారిలో నాలుగేళ్ల చిన్నారికి వ్యాధి నిర్ధారణ అయ్యిందన్నారు. ఈ వ్యాధి అరుదుగా పిల్లల్లో పుట్టుకతోనే సంక్రమిస్తుందన్నారు. ఈ వ్యాధిగ్రస్తులు ప్రతి నెల రక్త పరీక్షలు చేయించుకుని రక్త మార్పిడి చేయించుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ సురేంద్ర, ఏఎన్‌ఎం గార్లెట్, ఆశా కార్యకర్త శాంతకుమారి తదితరులున్నారు.

కూటమిలో కలహాల కుంపటి

మూన్నెల్లకే రోడ్డెక్కిన విభేదాలు

- మంత్రులు టీజీ భరత్, ఫరూక్ మధ్య చిచ్చు రేపిన మదర్సా
- కమిటీని రద్దు చేసి కొత్త కమిటీకీ సిఫార్సు చేసిన మంత్రి ఫరూక్
- పాత కమిటీ పునరుద్ధరించాలని మంత్రి టీజీ భరత్ పట్టు.. ఎమ్మెల్యే కోట్ల మద్దతు
- ఆదోనిలో ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు మధ్య విభేదాలు
- అధిష్టానం పంచాయితీ చేసినా నందికొట్కూరులో కలవని ఎంపీ, ఎమ్మెల్యే

అధికారం చేపట్టిన మూన్నెల్లకే కూటమిలో కలహాల కుంపట్లు రగిలాయి. మంత్రుల మధ్య అభిప్రాయ భేదాలు పొడచూపితే ఎమ్మెల్యే, ఎంపీలు విభేదాలతో రోడ్డుకెక్కారు. దీంతో మూడు పార్టీల ప్రయాణం మూన్నెల్లు గడువకనే ఇలా ఉంటే.. ఐదేళ్లు ఎలా ప్రయాణం చేస్తారోననే చర్చ టీడీపీ శ్రేణులతో పాటు రాజకీయ పార్టీలలో నడుస్తోంది. కొందరు ఆదాయం కోసం, ఇంకొందరు ఆధిపత్యం కోసం 'నువ్వా–నేనా' అనేలా ప్రవర్తిస్తున్నారు. ఈ వైఖరి కూటమి శ్రేణులతో పాటు అధికారులకు తలనొప్పిగా మారింది. ఈ నెలలో నామినేటెడ్ పోస్టుల భర్తీ జరగనుండటంతో మూడుపార్టీల మధ్య విభేదాలు తారస్థాయికి చేరే అవకాశం ఉందనే చర్చ కొనసాగుతోంది.



టీజీ భరత్



ఎస్ఎండీ ఫరూక్

సాక్షి ప్రతినిధి కర్నూలు: మంత్రులు టీజీ భరత్, ఎస్ఎండీ ఫరూక్ మధ్య కర్నూలులో ఓ మదర్సా వ్యవహారం చిచ్చు రేపింది. పాత కమిటీని రద్దు చేసి కొత్త కమిటీని ఓ మంత్రి సిఫార్సు చేస్తే, తిరిగి పాత కమిటీనే కొనసాగించాలని మరో మంత్రి పట్టుబట్టారు. మైనార్టీ శాఖ మంత్రిగా ఫరూక్, తన నియోజకవర్గంలోని వ్యవహారం కావడంతో భరత్ ఎవరికి వారు పట్టు వదలని పరిస్థితి. కర్నూలులో 'అంజుమన్ ఈ షంషియా మదర్ సా' జిల్లాలో ప్రముఖమైంది. కర్నూలు తొలి మునిసిపల్ చైర్మన్ సలాంఖాన్ దీన్ని నిర్మించి, నిర్వహణ కోసం తమ కుటుంబ ఆస్తులు రాసిచ్చారు. కుటుంబ సభ్యుల్లో ఒకరు అధ్యక్షుడిగా కొనసాగుతూ, తనకు నచ్చిన వ్యక్తులను కమిటీలో నియమించుకునే వెసలుబాటు కల్పించారు. ఆరు దశాబ్దాలకుపైగా ఈ మదర్సా కమిటీ కొనసాగుతోంది. ఏ ప్రభుత్వం వచ్చినా అందులో జోక్యం చేసుకోకుండా రెండేళ్లకోసారి రెన్యూవల్ చేస్తూ వచ్చారు. గత జనవరిలో కమిటీ గడువు ముగిసింది. రెన్యువల్ చేసేందుకు వక్ఫ్‌బోర్డు కమిటీ లేదు. వక్ఫ్‌బోర్డు కమిటీ చర్చించి, రెన్యూవల్‌పై నిర్ణయం తీసుకోవాలి. ఈ క్రమంలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో వక్ఫ్‌కమిటీ ఏర్పాటు జరగలేదు. దీంతో పాత కమిటీని రద్దు చేసి కొత్త కమిటీని వక్ఫ్‌బోర్డు సీఈఓ నియమించారు. ఈ నియామకం మంత్రి ఫరూక్ సిఫార్సుతోనే జరిగిందని పాత కమిటీ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం మంత్రి టీజీ భరత్ దృష్టికి వెళ్లింది. తన నియోజకవర్గంలోని వ్యవహారంలో జోక్యం వద్దని పాత కమిటీనే పునరుద్ధరించాలని ఫరూక్‌కు భరత్ చెప్పినట్లు చర్చ జరుగుతోంది. భరత్‌తో పాటు సీనియర్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి కూడా పాత కమిటీనే కొనసాగించాలని చెప్పినట్లు సమాచారం. అయితే భరత్, కోట్ల మాటలు ఖాతరు చేయకుండా ఫరూక్ కొత్త కమిటీ సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. తాను సుదీర్ఘకాలం ఎంపీగా కొనసాగడంతో కర్నూలు నగరంలోని మైనార్టీలతో ఉన్న సంబంధాలతో కోట్ల, తాను మంత్రిగా ఉండి సొంత నియోజకవర్గంలో ఒక కమిటీని నియమించుకోలేకపోతే మైనార్టీల్లో బలహీనమవుతాననే భావనలో భరత్ ఇద్దరూ వక్ఫ్‌బోర్డు నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. అయితే వక్ఫ్‌బోర్డు మైనార్టీ సంక్షేమశాఖ పరిధిలోకి రావడంతో మంత్రికి తెలియకుండా తానేం చేయలేనని భరత్‌కు సీఈఓ స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారం ఇలా ఉంటే వక్ఫ్‌బోర్డు తీర్మానం లేకుండా కమిటీని రద్దు చేసి కొత్త కమిటీని నియమించే అధికారం సీఈఓకు లేదని పాత కమిటీ హైకోర్టును ఆశ్రయించింది.

ఆదోనిలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే మధ్య వార్

కూటమి పొత్తులో భాగంగా ఆదోని నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా పార్థసారథి గెలుపొందారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇక్కడ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేకు అన్ని విషయాల్లో 60:40 నిష్పత్తిలో పంచుకునేలా ఒప్పందం జరిగినట్లు తెలుస్తోంది. మధ్యాహ్న భోజన పథకం, రేషన్ డీలర్లతో పాటు పలు నియామకాలకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు సిఫార్సు లేఖలు ఇచ్చారు. అయితే ఆయన సిఫార్సులు పరిగణలోకి తీసుకోవద్దని అధికారులకు ఎమ్మెల్యే చెప్పినట్లు తెలిసింది. దీంతో టీడీపీ శ్రేణులు మీనాక్షినాయుడు వద్దకు వెళ్లి 'మనం కష్టపడి పని చేస్తే, పార్థసారథి పెత్తనం ఏంటి? అసలు టీడీపీ లేకపోతే బీజేపీ ఇక్కడ గెలిచేదా? మన పనులకు ఎమ్మెల్యే అడ్డుపడటం ఏంటి?' అని వాపోయినట్లు చర్చ జరుగుతోంది. దీంతో ఎమ్మెల్యేపై మీనాక్షినాయుడు బహిరంగంగానే ఆరోపణలు చేశారు. 'ఎన్నికలకు ముందు చెప్పింది ఒకటి, గెలిపించాక పార్థసారథి చేస్తోంది మరొకటి. మేం గెలిపిస్తే మాకే అడ్డుపడతారా?' అని విమర్శించారు. దీనిపై పార్థసారథి కూడా దీటుగానే స్పందించారు. 'బెదిరింపులకో, డైలాగులకు భయపడేది లేదని, ప్రతీ అంశాన్ని వివాదం చేస్తే ఊరుకునేది లేదు. ఇలాంటివి చాలా చూశా!' అంటూ మీనాక్షిని చాలా తేలిగ్గా తీసుకున్నట్లు మాట్లాడారు. అప్పటి నుంచి ఇరువురి మధ్య మాటలు కూడా లేవు. ఇటీవల గర్ల్స్ హైస్కూలులో ఓ కార్యక్రమానికి ఇద్దరు హాజరైనా మాట్లాడుకోలేదు. దీంతో ఆదోనిలో బీజేపీ, టీడీపీ రెండుగా విడిపోయాయి.



నందికొట్కూరులో తెగని పంచాయితీ

నందికొట్కూరులో ఎమ్మెల్యే జయసూర్య, ఎంపీ బైరెడ్డి శబరి మధ్య విభేదాలు అధిష్టానం జోక్యం చేసుకున్నా సమసిపోలేదు. సీఐ సుధాకర్ రెడ్డి నియామకంలో ఇద్దరి మధ్య తలెత్తిన విభేదాలు తారస్థాయికి చేరాయి. ఎంపీతో పాటు ఆమె తండ్రి బైరెడ్డి రాజశేఖరరెడ్డిపై జయసూర్య తీవ్రంగా విమర్శలు చేశారు. అయితే బైరెడ్డి.. జయసూర్యను తేలిగ్గా తీసుకున్నారు. 'ఇలాంటి వారిని చాలా మందిని చూశా' అని తన అనుచరులతో ఎమ్మెల్యే వ్యవహారాన్ని కొట్టిపారేసినట్లు తెలుస్తోంది. ప్రతీ వ్యవహారంలో ఇద్దరూ సిఫార్సులు చేయడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. దీంతో ఈ నియోజకవర్గంలో ఏ నిర్ణయం తీసుకోవాలన్నా అధికారులు స్వేచ్ఛగా వ్యవహరించలేకపోతున్నారు.

సిఫారసులతో తలనొప్పి

తాజాగా నందికొట్కూరులో షాదీఖానా విషయంలో ఎమ్మెల్యే ఓ కమిటీని సిఫార్సు చేస్తూ మైనార్టీ సంక్షేమశాఖ అధికారికి లేఖ రాశారు. ఇది తెలిసి ఎంపీ శబరి మరో కమిటీని సిఫార్సు చేస్తూ కలెక్టర్‌కు లేఖ రాశారు. అయితే ఎమ్మెల్యే సిఫార్సు చేసిన కమిటీనే అధికారులు నియమించారు. దీనిపై శబరి కూడా అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఎమ్మెల్యే, ఎంపీ ఇద్దరూ కలిసి ఏకాభిప్రాయానికి వచ్చి నిర్ణయాలు తీసుకోవాలని, అలా కాకుండా ఇద్దరూ వేర్వేరుగా సిఫార్సు చేస్తే, ఇద్దరి సిఫార్సులను పక్కన పెట్టి తాము నిర్ణయం తీసుకుంటామని పలువురు అధికారులు చెప్పినట్లు సమాచారం.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి



బొమ్మలసత్రం: వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా కాటసాని రాంభూపాల్‌రెడ్డిని కొనసాగిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కొంత కాలంగా ఈయన నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న నేపథ్యంలో మళ్లీ ఆయననే తిరిగి నియమించింది. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా గత ఎన్నికల్లో క్రియాశీలకంగా పని చేశారు. పార్టీ నేతల మధ్య విభేదాలు లేకుండా అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు నడిచారు. ఈ నేపథ్యంలో మళ్లీ జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యధిక సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గుర్తింపు ఉన్న కాటసాని నియామకంతో సీనియార్టీకే పట్టం కట్టినట్లుయింది. కాటసాని రాంభూపాల్‌రెడ్డి నియామకం పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్ఎస్ఐ అవతారమెత్తి హల్‌చల్

- ప్రోటోకాల్‌పై దర్శనం కల్పించాలని హడావుడి
- అనుమానం వచ్చి ఆరా తీయగా నకిలీగా గుర్తింపు
- అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు



నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

శ్రీశైలం: పోలీసులకే టోపీ పెట్టాలని ప్రయత్నించిన వ్యక్తి చివరకు జైలు పాలయ్యాడు. శ్రీశైలం సీఐ ప్రసాదరావు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా చెట్లా పుష్పారం గ్రామానికి చెందిన కుసుమ ప్రశాంత్ అనే వ్యక్తి తన స్నేహితులతో కారులో బుధవారం శ్రీశైలం చేరుకున్నాడు. తాను సైబరాబాద్ కమిషనరేట్‌లో పని చేస్తున్నానని, వీఐపీ ప్రోటోకాల్‌తో దర్శనం చేయించాలని, పోలీస్ గెస్ట్ హౌస్‌లో వసతి కోసం ఏర్పాటు చేయాల్సిందిగా పోలీసులను కోరారు. ఈ మేరకు ప్రోటోకాల్‌పై దర్శనానికి పంపించాలని స్టేషన్ సిబ్బందిని సీఐ ప్రసాదరావు ఆదేశించారు. అయితే ప్రశాంత్, అతని స్నేహితుల ప్రవర్తనపై అనుమానం వచ్చిన కానిస్టేబుల్ వెంటనే విషయాన్ని సీఐ దృష్టికి తీసుకెళ్లాడు. ఈ మేరకు ఆయన విచారణ చేపట్టగా సైబరాబాద్ స్టేషన్ పరిధిలో ప్రశాంత్ పేరుతో ఆర్ఎస్ఐగా పని చేసే వ్యక్తులు ఎవరూ లేరని తేలింది. వెంటనే అదుపులోకి తీసుకుని విచారింగా ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడిపై ఘటకేసర్ పరిధిలోని రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో కేసులు నమోదయి ఉన్నాయని సీఐ తెలిపారు. ఓ విషయంలో మధ్యవర్తిత్వం వహిస్తానని ఓ వ్యక్తి వద్ద నుంచి ఫోన్‌పే ద్వారా రూ.40 వేలు వసూలు చేసినట్లు విచారణలో తేలిందన్నారు. పలు చోట్ల ఆర్ఎస్ఐనని చెప్పుకుంటూ దందాలు చేస్తున్నాడని, చివరకు శ్రీశైలం మల్లన్న దర్శనార్థమై వచ్చి పోలీసులకు పట్టుబడ్డాడన్నారు. నిందితుడి వద్ద నుంచి కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని గురువారం మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరుచగా రిమాండ్‌కు ఆదేశించారని సీఐ తెలిపారు. నకిలీ ఆర్ఎస్ఐను అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన వన్‌టౌన్ పోలీసులను సీఐ అభినందించారు.

భావితరానికి బంగారు బాటలు వేయండి

- రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్
- ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం



సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్, కలెక్టర్ రాజకుమారి తదితరులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నంద్యాల(న్యూటౌన్): భావితరానికి ఉత్తమ విద్యనందించి బంగారు బాటలు వేయాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఉపాధ్యాయులకు సూచించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. మంత్రి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉపాధ్యాయుడైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉప రాష్ట్రపతి, రాష్ట్రపతిగా దేశానికి ఎన్నో సేవలందించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయులున్నారన్నారు. సమాజాన్ని మార్చే శక్తి ఉపాధ్యాయుల సొంతమన్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు ఉద్యోగులు, పెన్షనర్లు, ఉపాధ్యాయ సంఘాలు అందరూ ఒకరోజు వేతనాన్ని విరాళంగా ప్రకటించినందుకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

- జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యతను వెలికితీసి జీవితంలో స్థిరపడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. గత సంవత్సరం 10వ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత 85 శాతం ఉందని, ఈ ఏడాది కచ్చితంగా వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. జిల్లాలో నిరుద్యోగం, బాల్యవివాహాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని, వీటిని నియంత్రించేందుకు తల్లిదండ్రులు, యువతలో మార్పులు తీసుకురావాలన్నారు. తాను కూడా జిల్లా పరిషత్, రెసిడెన్షియల్, ఏపీఆర్జేసీ స్కూళ్లలో చదివే కలెక్టర్ స్థాయికి చేరుకున్నానని గుర్తు చేశారు. శాంతిరాం విద్యాసంస్థల డైరెక్టర్ శివరాం, డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా, డీఐఈఓ సునీత, డీఈఓ సుధాకర్ రెడ్డి తదితరులు ఉత్తమ బోధనపై సూచనలిచ్చారు. అనంతరం 59 మంది ఉత్తమ ఉపాధ్యాయులను మంత్రి, జిల్లా కలెక్టర్ ఘనంగా సన్మానించారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

మెరుగైన వైద్య సేవలు అందించండి

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి ఫరూక్ అన్నారు. గురువారం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంత్రి అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ రాజకుమారి, ఎంపీ బైరెడ్డి శబరి, జీజీహెచ్ సూపరింటెండెంట్ వరప్రసాద్, డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ సర్వజన వైద్యశాలకు అవసరమైన పరికరాల ఏర్పాటుకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నిధుల నుండి వినియోగించుకోవాలని సూచించారు. ఆసుపత్రికి అవసరమైన తాగునీటి సౌకర్యాన్ని అమృత్ స్కీం కింద ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ కమిషనర్‌తో చర్చిస్తామన్నారు.

రుణాల మంజూరు లక్ష్యాన్ని చేరుకోవాలి

జిల్లాలో 2024–25 వార్షిక రుణాల ప్రణాళిక కింద వివిధ బ్యాంకుల ద్వారా రుణాల మంజూరు లక్ష్యాన్ని చేరుకోవాలని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో బ్యాంకర్ల సమన్వయ సమావేశం జరిగింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ పి.నరసింహారావు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నాగప్రవీణ్, డీసీసీ బ్యాంక్ సీఈఓ విజయ్ కుమార్, ఎల్‌డీఎం రవీంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వార్షిక రుణ ప్రణాళిక కింద రూ.12,828 కోట్లు కేటాయించామన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో అవసరమైన రుణాలు మంజూరు చేయాలన్నారు.

రెడ్ బుక్.. ఎల్లో బుక్‌లకు ఎవరూ భయపడరు

- మంత్రిగా పని చేసినా ఎమ్మెల్యేకు పాలనపై అవగాహన లేదు
- ఆమెను తిట్టాలంటే సంస్కారం అడ్డొస్తుంది
- వసూళ్ల దందా ప్రజలందరికీ తెలిసిందే
- మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



ఆళ్లగడ్డ: రెడ్‌బుక్, ఎల్లో బుక్‌లకు నియోజకవర్గంలో ఎవరూ భయపడరని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన రెడ్‌బుక్‌లో వంద మంది పేర్లు రాసుకున్నానని, అందులో ఒకరి ఇద్దరి తప్పా ఎవ్వరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఉడత ఊపులు, తాటాకు చప్పుళ్లకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఏమాత్రం జంకరని విషయం గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు. ఆళ్లగడ్డకు ఎన్నో సంవత్సరాలుగా కలగా మిగిలిపోయిన డిగ్రీ కళాశాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రత్యేక చొరవ తీసుకోని మంజూరు చేయించి తరగతులు కూడా ప్రారంభించడం జరిగిందన్నారు. ఇటీవల తరగతి గదుల్లోకి వెళ్లిన ఎమ్మెల్యే విద్యార్థులతో 'గత ఎమ్మెల్యే మంజూరు చేయించిన డిగ్రీ కళాశాల ఏదని' అనడం ఆమె అవివేకానికి నిదర్శనమన్నారు. విద్యాలయాలతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలు మంజూరైన తర్వాత భవనాలు, మౌలిక వసతులు మంజూరు చేస్తారని విషయం గతంలో మంత్రిగా పనిచేసిన ఎమ్మెల్యేకు అవగాహన లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఆళ్లగడ్డలో జరుగుతున్న వసూళ్ల దందాలపై ప్రజలతో పాటు టీడీపీ శ్రేణులే అంతటా చర్చించుకుంటున్నారన్నారు. వసూళ్ల విషయంపై ప్రజలే బహిరంగ చర్చకు వచ్చే సమయం దగ్గరలోనే ఉందన్నారు. మీడియా ముందు అసభ్యకరంగా మాట్లాడే ఎమ్మెల్యేను తాను తిట్టగలనని, కాని సంస్కారం అడ్డొస్తుందన్నారు. ఇప్పటికైనా సభ్యతా సంస్కారంతో మాట్లాడుతూ ఆళ్లగడ్డ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు.



శ్రీనివాససెంటర్‌లో వాహనదారుల వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

రాత్రి గస్తీలో అలసత్వం వద్దు

బొమ్మలసత్రం: జిల్లా కేంద్రంలో రాత్రిళ్లు గస్తీ తిరిగే పోలీసు సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా హెచ్చరించారు. బుధవారం అర్ధరాత్రి జిల్లా కేంద్రంలోని పలు ప్రధాన కూడళ్లతో పాటు పలు పోలీస్టేషన్లను ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్లలో రాత్రి విధులు నిర్వహించే సిబ్బందికి పలు సూచనలు అందించారు. రాత్రిళ్లు గస్తీ తిరిగే పోలీసుల వివరాలు అడిగి తెలుకున్నారు. బైక్‌లపై తిరిగే యువకులు, ఫుడ్ డెలివరీ బాయ్స్‌ను నిలిపి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆటోలు, కార్లు, ఇతర వాహనాల రికార్డులు పరిశీలించారు.